ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

మంగళవారం 13 ఫిబ్రవరి 2024



రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం 7

8 ప్రజావాణికి వినతుల వెల్లువ



రాజన్నకు తొలి మొక్కులు

- వేములవాడకు తరలివస్తున్న మేడారం భక్తులు
- తరతరాలుగా వస్తున్న సంప్రదాయం
- రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి పోటెత్తుతున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర. రెండేళ్లకోసారి వైభవంగా నిర్వహించే మేడారం మహా జాతరకు ఉమ్మడి జిల్లాతోపాటు ఇత రాష్ట్రాల నుంచి భక్తులు తరలివెళ్తారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు ముందుగా జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి తరలివస్తారు. తల్లుల దీవెనల కంటే ముందు రాజన్న దర్శించుకోవడానికి బారులుదీరుతారు. దీంతో కొద్ది రోజులుగా వేములవాడ రాజన్న క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. సమ్మక్క, సారలమ్మ అంటే ఉప్పొంగి పోయే భక్తులు మేడారం మహాజాతర కంటే ముందే తరతరాలుగా జిల్లాని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి రావడం అనవాయితీగా వస్తోంది. తొలి మొక్కు రాజన్నకు చెల్లించుకోవడంతోపాటు బద్దిపోచమ్మకు బోనం, కోళ్లు, మేకలతోపాటు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆ తరువాతే మేడారంలోని సమ్మక్క, సారలమ్మ దీవెనలకు తరలివెళ్తారు. వేములవాడ రాజన్నను ఇతర గ్రామ దేవతలకు తండ్రిగా భావించి ఇక్కడి దర్శనాలకు వస్తుంటారు. మాఘమాస పౌర్ణమి ఘడియల్లో మేడారం జాతర ఈ నెల 21 నుంచి 24 వరకు జరుగనుంది. జాతరకు ఉభయ తెలుగు రాష్ట్రాలు ఆంధ్రా, తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిస్సా, కర్ణాటక, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. తరలి వచ్చే భక్తుల్లో ఎక్కువ శాతం వేములవాడకు ముందుగానే వస్తుండడంతో ఆలయ అధికారులు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, ఇతర మౌలిక సదుపాయలు కల్పించారు. మేడారం జాతర వరకు ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు స్వామివారి నిరంతర దర్శనం కల్పిస్తున్నారు.

● రాజన్నకు మేడారం ఆదాయం

వేములవాడకు మేడారం భక్తుల రాకతో రాజన్నకు భారీగా ఆదాయం సమకూరుతుంది. ఈ నెలలో సమ్మక్క సారలమ్మ మహాజాతర ఉండడంతో జనవరి నుంచే వేములవాడకు భక్తులు తరలివస్తున్నారు. జనవరిలో దేవస్థానానికి రూ. 11.43 కోట్ల ఆదాయం వచ్చింది. ఫిబ్రవరి 7వ తేదీన లెక్కించిన హుండీ ఆదాయం రూ.2 కోట్ల 15 లక్షల 67 వేల 130 లభించింది. 71.5గ్రాముల బంగారం, 13 కిలోల 600 గ్రాముల వెండి సమకూరింది. సమ్మక్క సారలమ్మ భక్తుల రాకతో ఆలయ అధికారులు ముందస్తుగానే సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

● రెండువారాల క్రితం మొక్కులు చెల్లించుకున్న సీతక్క

సమ్మక్క సారలమ్మ జాతరకు ముందు భక్తులు రాజన్నను దర్శించుకునే అనవాయితీలో భాగంగా పంచాయతీరాజ్ మంత్రి సీతక్క రెండు వారాల క్రితమే వేములవాడకు వచ్చి స్వామివారిని దర్శించుకొని వెళ్లారు. సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందు వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకోవడం తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అనవాయితీగా వస్తోందని సీతక్క పేర్కొన్నారు. ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతకు ఇక్కడి నుంచి తీసుకవెళ్లిన అక్షింతలు, నైవేద్యాలను అక్కడ సమర్పించుకోవడం జరుగుతుందని అన్నారు.

జిల్లాలో అధికారుల బదిలీలు

సిరిసిల్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దీర్ఘకాలికంగా ఉన్న అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం జిల్లా అధికారుల బదిలీలు జరిగాయి. జడ్పీ సీఈవో బి.గౌతంరెడ్డిని జగిత్యాలకు బదిలీ చేశారు. జిల్లా సీఈవోగా టీఎస్‌ఐఆర్‌డీ జేడీ ఎం. ఉమారాణిని నియమించారు. జిల్లా పంచాయతీ అధికారి ఏ.రవీందర్‌ను కరీంనగర్ డీపీవోగా బదిలీ చేశారు. జిల్లా డీపీవోగా కరీంనగర్ డీపీవో వీరబుచ్చయ్యను నియమించారు. డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్‌ను మెట్‌పల్లి ఆర్డీవోగా బదిలీ చేశారు. మంచిర్యాల నుంచి సిరిసిల్లకు డీఆర్‌డీవోగా బి. శేషాద్రిని నియమించారు. అదనపు డీఆర్‌డీవో సీహెచ్ మదన్‌మోహన్‌ను జగిత్యాల అదనపు డీఆర్‌డీవోగా బదిలీ చేశారు. ఆదివారం జిల్లాలోని ఎంపీడీవో ఎం.శంకర్, పి.రవీందర్, ఎస్.రామిరెడ్డి, ఎన్.రాజేందర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, రమాదేవి, పి.లచ్చాలు, బి.చిరంజీవి, బి.రామకృష్ణను జగిత్యాల జిల్లాకు బదిలీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీపై వచ్చిన వారిలో ఎ.రాజేందర్, రాజీవ్ మల్హోత్రా, జి.సత్తయ్య వి.శ్రీనివాసమూర్తి, వి.జయశీల, కె.శ్రీనివాస్, వై.శశికళ ఉన్నారు.

సిరిసిల్లలో రోడ్డు భద్రతపై బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 12: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, గోపాల్‌నగర్, కొత్త బస్టాండ్, నేతన్న చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ స్వీయ రక్షణతోపాటు కుటుంబం క్షేమం కోసం హెల్మెట్ ధరించాలన్నారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్సై రాజు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' అమలుకు వివరాల సేకరణ

రుద్రంగి, ఫిబ్రవరి 12: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా గృహజ్యోతి కింద 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనుంది. ఇందు కోసం విద్యుత్ వినియోగదారుల వివరాలను సెస్ అధికారులు ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేస్తున్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సెస్ అధికారులు విద్యుత్ వినియోగదారులకు సంబంధించి ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ మీటర్ నంబరు, వినియోగదారుడి మొబైల్ నంబర్‌లను సేకరిస్తున్నారు. ఈ నెల 15 సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు సెస్ ఏఈ మహేష్ తెలిపారు.

ఆయుష్మాన్ సెంటర్‌ను సందర్శించిన ఎంపీ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 12: ప్రజాహిత యాత్రలో భాగంగా వేములవాడకు వచ్చిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ శాత్రాజుపల్లిలోని ఆయుష్మాన్ సెంటర్‌ను సందర్శించి చలించిపోయారు. విటమిన్ ఏ ట్యాబ్‌లెట్స్ కోసం వచ్చిన చిన్నారులు నిలబడి ఉండడాన్ని చూసి అక్కడికి వెళ్లారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడం, టాయిలెట్స్ ఏర్పాటు చేయకపోవడంపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రానికి ఎందుకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదని, విద్యుత్ లేకపోతే వైద్యులు ఎలా విధులు నిర్వహిస్తారని అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ బకాయిలు ఉండడంతో సరఫరా కట్ చేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బకాయిల సంగతి తాను చూసుకుంటానని, 24 గంటల్లో ఆరోగ్య కేంద్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లేని పక్షంలో తానే నేరుగా సెస్ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆసుపత్రిలో ఫ్యాన్లు, ఫర్నిచర్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో సొంత డబ్బులు ఇస్తానని వెంటనే సమకూర్చాలని స్థానిక బీజేపీ నాయకులకు సూచించారు.

రేపు జిల్లా స్థాయి సీనియర్స్ కబడ్డీ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 12:జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి సీనియర్స్ పురుషుల కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట రామ్‌కుమార్, చైర్మన్ జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి తిరుపతి ప్రకటనలో తెలిపారు. సీనియర్స్ పురుషుల కబడ్డీ పోటీలలో 85 కిలోల బరువు ఉన్న క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్‌కార్డుతో క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

ఎస్బీ డీఎస్పీ రవికుమార్ బదిలీ

సిరిసిల్ల క్రైం ఫిబ్రవరి 12: సిరిసిల్ల ఎస్బీ డీఎస్పీ రవికుమార్‌ను బెల్లంపల్లి ఏసీపీగా బదిలీ చేస్తూ డీజీపీ రవి గుప్త సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల డీసీఆర్బీ డీఎస్పీగా వనస్థలిపురం నుంచి భీం రెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు.

క్లాత్ ఫోల్డింగ్ మిషన్ అద్భుతం



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : మరమగ్గాలపై తయారు చేసిన క్లాత్‌ను మడతపెట్టేందుకు పదోతరగతి విద్యార్థి జక్కని హేమంత్ తయారు చేసిన ఫోల్డింగ్ మిషన్ అద్భుతంగా ఉందని కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించారు. సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన జక్కని జ్ఞానేశ్వర్, రూప దంపతుల కుమారుడు హేమంత్ శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. మరమగ్గాలపై తయారైన క్లాత్ ఫోల్డింగ్ చేసేందుకు తల్లిదండ్రుల కష్టాలను చూసి చలించిన హేమంత్ ఉపాధ్యాయుల సహకారంతో రూ.2వేల ఖర్చుతో క్లాత్ ఫోల్డింగ్ యంత్రాన్ని తయారు చేశాడు. విద్యాశాఖ చేపట్టిన ఇన్‌స్పైర్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. డీపీఆర్వో మామిండ్ల దశరథం విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం కలెక్టరేట్‌లో విద్యార్థి తయారు చేసిన ఎగ్జిట్ బిట్ ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ప్రజావాణికి వచ్చే వారికి అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. హైదరాబాద్‌లోని టీ వర్క్స్‌కు పంపించి పేటేంట్ కోసం ప్రయత్నం చేద్దామన్నారు. హేమంత్ తండ్రి జ్ఞానేశ్వర్ కరోన సమయంలో చనిపోవడంతో భార్య రూప కొడుకుతోపాటు కూతురు కీర్తిని చదివిస్తోంది. ఇబ్బందిగా ఉందని ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకోగా పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వ తీసుకుంటుందని తెలిపారు. డీఈవో రమేష్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట మండలానికి చేరుకున్న ప్రజాహిత పాదయాత్ర

కోనరావుపేట, ఫిబ్రవరి 12 : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర సోమవారం రాత్రి 9 గంటలకు కోనరావుపేట మండలంలోని సుద్దాలకు చేరుకుంది. బండి సంజయ్ సుద్దాలకు చేరుకోగానే మహిళలు ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సుద్దాల నుంచి పల్లిమక్త గ్రామంలో పాదయాత్ర కొనసాగించారు. అనంతరం నాగారం గ్రామంలో బస చేశారు. ఈ యాత్రలో బీజేపీ జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, రేగుల మల్లికార్జున్, మిర్యాల్‌కార్ బాలాజీ, గొట్టె రామచంద్రం, వెలిశాల రవి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలను ఆంధ్రాకు తరలించిన ఘనత బీఆర్ఎస్, కాంగ్రెస్‌దే

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 12 : కృష్ణా జలాలను ఆంధ్రాకు తరలించిన ఘనత బీఆర్ఎస్, కాంగ్రెస్‌దేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండిసంజయ్ అన్నారు. మండ లంలోని అచ్చన్నపల్లి, బాలరాజుపల్లి, చెక్కపల్లి, నూకలమర్రి, నమిలిగుండుపల్లి, వట్టెంల గ్రామాల్లో సోమవారం ప్రజాహిత యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా నూకలమర్రిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పంటలు ఎండినా కృష్ణా జలాలను కేసీఆర్ ఆంధ్రాకు తరలించినట్లు సీఎం జగన్ అసెంబ్లీ సాక్షిగా చెప్పారన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా 512 టీఎంసీలు రావాల్సి ఉండగా 299 టీఎంసీలకే గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించిందని, పదేళ్లలో 812 టీఎంసీల నీటిని ఆంధ్రాకు దోచి పెట్టిందని అన్నారు. గతంలో పోతిరెడ్డిపాడుకు బొక్కపెట్టి 400పైగా టీఎంసీల నీటిని సీమకు కట్టబెట్టి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మొత్తంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు 1200 టీఎంసీల నీటిని ఆంధ్రాకు తరలించాయని, ఇప్పుడు అసెంబ్లీలో కృష్ణా జలాలపై మీరు తరలించారంటే మీరు తరలించారంటూ సిగ్గులేకుండా కొట్లాడుతురని, కొత్త డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ఒక్క టీఎంసీ నీటితో 10వేల ఎకరాలు సాగు చేయవచ్చన్నారు. 1200 టీఎంసీల నీటిని ఉపయోగించుకుంటే ఎన్ని ఎకరాలు సాగులోకి వచ్చేదో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. బీఆర్ఎస్‌కు అయోద్యలో రామమందిరం నిర్మించడం ఇష్టంలేదని తేటతెల్లమైందన్నారు. రాముడి అక్షింతలను రేషన్ బియ్యమా? బాస్మతి బియ్యమా? అని హేళన చేశారన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించి 500 ఏళ్ల భారత ప్రజల వాంఛను మోదీ నెరవేర్చారన్నారు. దేవుడికి గుడి కట్టేది బీజేపీ పార్టీయని, కూల్చేది బీఆర్ఎస్, కాంగ్రెస్‌ని విమర్శించారు. బీఆర్ఎస్ కారు షెడ్డుకు పోయిందని, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పోయారని అన్నారు. మోదీ వ్యాక్సిన్ అంటే రోగం తగ్గించేదైతే కేసీఆర్ వ్యాక్సిన్ 90 ఎంఎల్ అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడికెళ్లినా వంద కోట్లు ఇస్తామన్నారని, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి 500 కోట్లు ఇస్తానని ఇవ్వలేదని అన్నారు. దేవాలయం నిధులనే మళ్లించాలని చూస్తే బీజేపీ అడ్డుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద పథకం కింద వేములవాడ రాజన్న దేవాలయాన్ని అభివృద్ధి చేస్తానంటే నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరించారన్నారు. వేములవాడలో నిర్మించిన మూలవాగు బ్రిడ్జి రెండు సార్లు కూలిపోయిందన్నారు. గుడి చెరువు పూర్తి కాకపోవడంతో పట్టణంలోని మురికి నీరంతా గుడి చెరువులోకి చేరుతోందన్నారు. గత ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మత్రి పదవి ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందకూడదన్నదే గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ ఉద్దేశమన్నారు. వేములవాడ నియోజక వర్గ అభివృద్ధికోసం మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద కూలీ పనులకు రూ.182.8 కోట్ల నిధులను, మెటీరియల్ కంపోనెంట్ పనులకు రూ.86.7 కోట్లను, మొక్కల పెంపకం కోసం రూ.92.2 కోట్లను, 14, 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.101.38 కోట్లను, ట్రై సైకిళ్ల కోసం రూ.64.68 కోట్లను, మరుగుదొడ్ల నిర్మాణం కోసం 11.4ను, పీఎం కిసాన్ సమ్మాన్ నిధుల కింద రూ.98.3 కోట్లను, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.3 కోట్లను ఖర్చు చేసినట్లు చెప్పారు. వేములవాడ రూరల్ మండలంలో కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచి రూ.70 కోట్లవరకు ఖర్చు చేశామన్నారు. ఇలా మొత్తంగా నియోజకవర్గానికి రూ.575 కోట్ల 95 లక్షలకు పైగా కేంద్రం నుంచి నిధులు తెచ్చామన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి బడ్జెట్‌లో హామీలకు నిధులు కేటాయించలేదన్నారు. రైతుబంధు 15 వేలకు పెంచుతామని ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో వేయలేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఇస్తామని ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. గుడిని మింగేది బీఆర్ఎస్ పార్టీ అనుకుంటే గుడిని గుడిలో దేవుడిని మింగేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. తిరిగి తనను ఎంపీగా గెలిపిస్తే వేములవాడ రాజన్న ఆలయం, కొండగట్టు ఆంజన్న ఆలయాలను అభివృద్ధి చేసే బాధ్యత తనదేనన్నారు. అనంతరం బాలరాజుపల్లిలో పేద కుటుంబానికి చెందిన బండ శివప్రసాద్ ఏదైనా ఉద్యోగం కావాలని బండి సంజయ్‌ని కోరగా ఉద్యోగం ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ వేములవాడ నియోజకవర్గ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కుమ్మరి శంకర్, పార్టీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.



పట్టెంలలో పాదయాత్ర చేస్తున్న ఎంపీ బండి సంజయ్

పెట్రోల్ బంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 12: ప్రతీ పెట్రోల్ బంక్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని ఓ కల్యాణమండపంలో జిల్లాలోని పెట్రోల్ బంకుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పెట్రోలియం యాక్ట్ 2002 ప్రకారం ప్లాస్టిక్ బాటిళ్లు, క్యాన్‌లలో పెట్రోల్ పోయవద్దన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత ఎస్‌హెచ్‌వోలు ప్రతీ పెట్రోల్ బంక్‌ను మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేస్తారన్నారు. ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించారనే నిబంధనలను కఠినతరం చేయడానికి నో హెల్మెట్ నో పెట్రోల్ అనే నినాదంతో పోలీస్‌శాఖ విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారుడికి పెట్రోల్ పోయవద్దని సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, టౌన్ సీఐ రఘుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కన్నుల పండువగా మార్కండేయుడి శోభాయాత్ర



మార్కండేయస్వామి రథోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

'విఠలా.. విఠలా.. పాండురంగా' అంటూ శివభక్త మార్కండేయస్వామి నామస్మరణతో స్వామివారి శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివభక్త మార్కండేయ స్వామి జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మార్కండేయస్వామి దేవస్థానంలో స్వామివారి మహాయజ్ఞం చేపట్టారు. సాయంత్రం మార్కండేయస్వామి శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై మార్కండేయస్వామి ఉత్సవ విగ్రహంతో దేవస్థానం నుంచి బయలు దేరిన యాత్ర గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా, చేనేత చౌక్, పెద్దబజార్ మీదుగా వేంకటేశ్వర స్వామి దేవాలయం మీదుగా కొనసాగింది. శోభాయాత్రలో పద్మబ్రాహ్మణులు ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్రలో భాగంగా గాంధీ, అంబేద్కర్, నేతన్న విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఉత్సవాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ మార్కండేయ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, పవర్‌లూం టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పద్మశాలి సంఘం ప్రతినిధులు బొల్లి రామ్మోహన్, డాక్టర్ గాజుల బాలయ్య, మ్యాన రవి, మోర రవి, వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి వెల్దండి దేవదాస్, మోర రాజు, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు కాముని వనిత, సెస్ డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, దిడ్డి రమాదేవి, గుజ్జెతార, ఆడెపు చంద్రకళ, దార్నం అరుణ, పత్తిపాక పద్మ, కట్టికోల లక్ష్మీనారాయణ, వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న బండి సంజయ్



శోభాయాత్రలో కౌన్సిలర్లు, ప్రతినిధులు



శోభాయాత్రలో ప్రజాప్రతినిధులు



పూలమాల వేస్తున్న నాయకులు

ఇంజనీరింగ్ విద్యార్థులు వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి 12 : ఇంజనీరింగ్ విద్యార్థులు వారం రోజులు నిర్వహించే వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెకానికల్ విభాగాధిపతి, కన్వీనర్ డా.. కె. వసంత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించే 'ఫైనైట్ ఎలిమెంట్ అనాలసెస్ యూజింగ్ అన్సిస్ వర్క్ బెంచ్' ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకొని ఏదైనా రియల్ ప్రొడక్ట్‌ను తయారు చేయకుండానే దాని మోడల్‌ను ప్రిపేర్ చేసుకోవచ్చునన్నారు. చేసిన మోడల్ ఎంత వరకు పనిచేస్తుందో తెలుసుకోవచ్చునన్నారు. అసలు ప్రోడక్ట్ తయారు చేయకుండానే ఖర్చును తగ్గించుకొని ఖచ్చిత్వాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ తెలుసుకోవటంతో ప్రొడక్ట్ ఎలా పనిచేస్తుంది, ఏ మెటీరీయల్ వాడాలన్న విషయాలు తెలుస్తాయన్నారు. ఈ వర్క్‌షాప్‌కు సహకరించిన రిసోర్స్ పర్సన్ రాజ మహేంద్ర సిమ్యులేషన్ ఇంజనీర్ హైదరాబాదు, మెకానికల్ ఫ్యాకల్టీ కోకన్వీనర్ డా.. సురేష్ అర్జుల్లా, కోఆర్డినేటర్ బి. నర్సయ్యకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో వైస్ ప్రిన్సిపాల్ డా.. టి.వేణుగోపాల్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కన్వీనర్ వసంత్‌కుమార్

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

బోయినపల్లి, ఫిబ్రవరి12: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం దేశాయిపల్లి సమీపాన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారి వివరాలు తెలియాల్సి ఉంది.

వేములవాడకు పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ పరిసరాలు



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 12 : దక్షిణ కాశీ, ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం నాడు అశేష భక్తజనంతో జాతరను తలపించింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రతినిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో వేములవాడ పుణ్యక్షేత్రంలో గత కొద్ది రోజులుగా జాతరను పోలిన వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో సోమవారం నాడు సుమారు 60 వేలకు పైగా భక్తులు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించినట్లు అంచనా. ఆదివారం తెల్లవారుజాము నుండి నిరంతరాయంగా కొనసాగిన స్వామివారి దర్శనం సోమవారం రాత్రి వరకు సాగింది. ఫలితంగా ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 90 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. ఈ సందర్భంగా వారు ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుండి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన కోడె మొక్కు చెల్లింపు సోమవారం రాత్రి వరకు నిరంతరాయంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణం తో పాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటల కొద్దీ నిరీక్షించి తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారి కి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

డీఈఈ సెట్ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, ఫిబ్రవరి12: డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులై ఇప్పటి వరకు ఒరిజినల్ ధ్రువ పత్రాల పరిశీలన చేయించుకోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు మూడవ దశలో ప్రవేశాల కోసం ఈ నెల 14న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో తమ సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవచ్చని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల కోర్సు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఈఎల్ఈడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) మొదటి సంవత్సరం 2023-24లో చేరుటకు నిర్వహించిన డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో డైట్‌కు రావాలని కోరారు. మూడవ దశ ప్రవేశాలకు ఈ నెల 15 నుంచి 17 వరకు ఆప్షన్ పెట్టుకోవచ్చున్నారు. మరిన్ని వివరాలకు డీఈఈ సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని రాజాపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండకు చెందిన ఆర్ కల్పన అనే మహిళ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తుండగా, విధుల్లో భాగంగా జమ్మికుంటకు వచ్చి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుంది. ఈ క్రమంలోనే రాజపల్లి గ్రామ శివారులోకి ద్విచక్ర వాహనం చేరుకోగానే, వాహనం అదుపు తప్పి పక్కనే బోర్డుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో సదరు మహిళలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బ్యాంకులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉన్న యూనియన్ బ్యాంక్‌లో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగి పలు ఫైళ్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా యూబీఐ స్టోర్‌రూంలో మంటలు అంటుకుని ప్రమాదం జరిగిందని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ ఇంజన్‌తో సహా ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశామని ఆయన తెలిపారు.

శివంగాలపల్లిలో మూడు ఇళ్లలో చోరీ

కోనరావుపేట, ఫిబ్రవరి 12 : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ కోనరావుపేట మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత వారం రోజుల్లో నాలుగు గ్రామాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బొద్దు దేవయ్య, జంగం లక్ష్మి, గూడూరు రేణుక వీరు ఇళ్లకు తాళం వేసి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు బొద్దు దేవయ్య ఇంటిలో తాళం పగలగొట్టి 30 తులాల వెండి ,జంగం లక్ష్మి ఇంటిలో తాళం పగలగొట్టి 20 తులాల వెండి, గూడూరి రేణుక ఇంటి తాళం పగలగొట్టి మూడు వేల నగదును అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు దొంగతనం తీరును పరిశీలించి సీసీ కెమెరాల ఫుటేజ్ తీయగా ఇద్దరు వ్యక్తులు మంకీ క్యాప్ ధరించి దొంగతనానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసుకుని డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టారు.

కుక్కల దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయందోళనకు గురిచేస్తున్నాయి. గత రెండు రోజులుగా కుక్కలు దాడులకు ప్పాలడుతున్నాయి. సోమవారం వరకు ఆరుగురు కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు బయటికి రావడానికి భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 114మంది రైతులు 1,134క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 14క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

వీణవంక ఫిబ్రవరి 12: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన ముష్క సదయ్య (45)ఆర్థిక ఇబ్బందులతో తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తూ మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


నందిమేడారంలో సైబర్ మోసం

ధర్మారం,ఫిబ్రవరి12: ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నందినేని పవన్‌కుమార్ ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ. 10వేలు అతనికి తెలియకుండా వేలిముద్రతో సైబర్ నేరగాళ్లు డ్రా చేశారు. ఈ మేరకు సోమవారం బాధితుడు పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన ఎస్‌బీఐ ఖాతా నుంచి ఆదివారం సాయంత్రం ఏఈపీఎస్ ద్వారా పది వేల రూపాయల నగదును విత్‌డ్రా చేశారు. డ్రా చేసినట్టు తన సెల్ నంబరుకు మెసేజ్ వచ్చింది. ఆందోళనకు గురైన పవన్‌కుమార్ వెంటనే 1930 ఫిర్యాదు చేశాడు. ఈ నెల 9న ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ కోసం తన వేలిముద్రలను ఉపయోగించాడు. అక్కడి నుంచి ఎవరో తన వేలిముద్రలను ఉపయోగించి మోసం చేశారని ఆయన అనుమానంతో సోమవారం బాధితుడు పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆధార్ కార్డులను బయోమెట్రిక్ లాక్ చేసుకోవాలని ఆయన సూచించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు, ఫిబ్రవరి 12: మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి సాగర్(28)సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు జూలపల్లి ఎస్సై ఎస్.శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత కొన్ని రోజులుగా కుటుంబంలో కలతలు వచ్చాయని దీంతో జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మృతి చెందాడని తెలిపారు. సాగర్‌కు భార్య కల్యాణి, కూతురు 18నెలల పాప ఉందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సాగర్ నేత్రాలను లయన్స్ క్లబ్‌వారు సేకరించారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరానికి ఎంపిక



జ్యోత్స్న

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 12: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో నిర్వహించే శిక్షణ శిబిరానికి గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్, శిక్షకురాలు జ్యోత్స్న ఎంపికయ్యారు. 9వ బెటాలియన్ తరుపున జ్యోత్స్న పాల్గొంటు న్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

సిరిసిల్ల క్రైం , ఫిబ్రవరి 11 సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మల్లేశం ఇంట్లో సెల్ ఫోన్, రూ. 500 నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు దొంగలను సోమవారం అరెస్ట్ చేశామని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. పెయింటింగ్ చేస్తూన్నా శ్రీకాంత్, సంతోష్‌లు చోరీకి పాల్పడినట్లు అయన తెలిపారు.

మల్లికార్జున్‌రెడ్డికి మిలియనీర్ ఫార్మర్ అవార్డు

చొప్పదండి, ఫిబ్రవరి 12: చొప్పదండి మండలంలోని పెద్దకుర్మపల్లికి చెందిన ఉత్తమ రైతు మవురం మల్లికార్జునరెడ్డి డిస్ట్రిక్ట్ మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్నారు. సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కెవికెలో జరిగిన రైతు సదస్సులో మల్లికార్జున్‌రెడ్డి అవార్డును ఐసిఎఆర్ డిడిజి డాక్టర్ ఉత్తంసింగ్ గౌతం ఏటిఎఆర్ఐ డైరెక్టర్‌లు అందజేశారు. తనకు అవార్డు రావడానికి కృషి చేసిన జమ్మికుంట కెవికె డైరెక్టర్ వెంకటేశ్వరరావుకు ఈ సందర్భంగా మల్లిఖార్జునరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

రైల్వే లైన్ బాధితులకు పరిహారం చెల్లించాలి

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రైల్వే లేన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులు సోమవారం సాయంత్రం ప్రజాహిత యాత్ర చేస్తున్న బండి సంజయ్‌ను కలిశారు. స్థానిక తెలంగాణ చౌక్ వద్దకు చేరుకున్న బండి సంజయ్‌ను కలిసిన బాధితులు తమకు తగిన పరిహారం చెల్లించాలని, లేదంటే తమ భూములను గెజిట్ నుంచైనా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేను ఈ అంశంపై పలుమార్లు కలిసినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై స్పందించిన బండి సంజయ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

విద్యుత్ తీగలు అమర్చి చేపలు పట్టిన వ్యక్తుల రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12: విద్యుత్తు తీగలు అమర్చి చేపలను వేటాడుతున్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన దొంతరవేణి విజయ్, కుర్ర భాస్కర్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ రిమాండ్ విధించగా కరీంనగర్ జైలుకు తరలించామని ఎస్ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గల చెక్ డ్యాంలో తాము చేపలు పెంచుతున్న క్రమంలో పదిర వాసులు విజయ్, భాస్కర్‌లు కరెంటు షాక్‌తో చేపలను వేటాడుతున్నారని ఎలవేణి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎవరైనా విద్యుత్తు తీగలను అమర్చి జంతువులు, చేపలు వేటాడడంతో పాటు పంట పొలాల చుట్టు కరెంటు తీగలను ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15న జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 12: టీఎస్ఎన్‌పీడీసీఎల్ జిల్లా సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. కాల్‌లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో వాటిని పొందవచ్చున్నారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోలు ఎక్కించే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 12: మండలంలోని నమిలికొండ గ్రామంలో రామడుగు మండల కేంద్రానికి చెందిన బత్తిని మదన్(37)శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ అర్జరాజు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. మదన్ రెండు సంవత్సరాల నుంచి అత్తగారి ఊరు మండలంలోని నమిలికొండ గ్రామంలో నివసిస్తూ ఆటో నడుపుకుంటూ జీవనోపాది పొందుతున్నాడన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై ఇంటిలో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ దాగుడు మూతలు

● లక్ష కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసీఆర్ ప్రభుత్వం ● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

వేములవాడ, ఫిబ్రవరి 12 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ దాగుడుమూతలు ఆడుతున్నాయని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన వేములవాడ పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కెసిఆర్ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని కేసీఆర్ ఆస్తులను జప్తు చేసి కాళేశ్వరం సంబంధించిన సొమ్మును రికవరీ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని ఆయన సవాల్ విసిరారు. రాజీవ్ రహదారిపై సభా సంఘం మాదిరిగా డ్రామాలొద్దని, మేడిగడ్డ ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థను బెదిరించి స్వయం ప్రకటిత మేధావిగా చెప్పుకునే ఓ నాయకుడు తన కుటుంబ సభ్యులకు సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నారని, క్వాలిటీ లేకుండా పనులు చేసి పిల్లర్లు వంగిపోయి ప్రమాదానికి కారకుడు ఆ స్వయం ప్రకటిత మేధావే అని అన్నారు. సదరు స్వయం ప్రకటిత మేధావిపై తక్షణమే క్రిమినల్ కేసులు పెట్టాలని, కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపంతో పనులు చేసి ప్రజల సొమ్ములు స్వాహా చేసిన వారిపై కేసులు పెట్టి సొమ్మును రికవరీ చేసి నిజాయతీని నిరూపించుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రెండు పార్టీలు కలిసి అసెంబ్లీని టైంపాస్ వ్యవహారంగా మారుస్తున్నారని అన్నారు.



వేములవాడలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

ఆటో నడిపిన బండి సంజయ్

ప్రజాహిత యాత్రలో భాగంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సోమవారం సాయంత్రం వేములవాడలో ఆటో నడిపించారు. యాత్ర సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు బండి సంజయ్‌ను కలిసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కారణంగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని మొరపెట్టుకున్నారు. ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని బండి సంజయ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకుడు చెన్నమనేని వికాస్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో పోలీసు కస్టడీకి శ్రీపతిరావు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: భూకబ్జా కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తోట శ్రీపతిరావును కరీంనగర్ రూరల్ పోలీసులు సోమవారం కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్‌లోని వివేకానందపురి కాలనీలో అనుమాండ్ల రవీందర్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న భవనం 8 పిల్లర్లను కూల్చివేసిన ఘటనకు సంబంధించిన కేసులో ఈ నెల 6న తోట శ్రీపతిరావును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి తోట శ్రీపతిరావును మరింత లోతుగా విచరించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కస్టడీకి కోర్టు అనుమతించింది. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు కస్టడీకి అనుమతించినట్లు సమాచారం. శ్రీపతిరావును కస్టడీకి తీసుకుని పోలీసులు అతడి ఇంటికి వెళ్లి సోదాలు జరిపి పలు కీలకమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



శ్రీపతిరావును అతని ఇంటిలో సోదాలకు తీసుకువెళ్తున్న పోలీసులు

రాజన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దర్శించుకున్నారు. సోమవారం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం ఆహ్వానం పలికి పూజల అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం గావించారు. ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ శ్రీరాములు వెంట ఉన్నారు.

యువకుడి హత్య



శ్రీధర్(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 12: వేములవాడ పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన కురుకుంట్ల శ్రీధర్ (25) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. శ్రీధర్ కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శ్రీధర్ రాజన్న ఆలయ ధర్మగుండం వద్ద జంగమ పూజారిగా జీవనోపాధి పొందుతున్నాడు. అదే కాలనీకి చెందిన అతడి స్నేహితుడు బాబు ఆదివారం రాత్రి శ్రీధర్ ఇంటికి వచ్చి పార్టీ ఉందని తీసుకెళ్లాడు. శ్రీధర్ ద్విచక్ర వాహనంపై జర్మనీ గెస్ట్‌హౌస్ సమీపంలోని ఖాళీ ప్రాంతానికి వెళ్లారు. ఇంట్లో నుంచి వెళ్లిన శ్రీధర్ తిరిగి రాకపోవడంతో అతడి భార్య యామిని ఫోన్ చేసింది. తీయక పోవడంతో భయాందోళనకు గురైంది. తెల్లవారుజామున శ్రీధర్ హత్యకుగురయ్యాడని తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య యామిని, కుమారుడు ఉన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ ఎస్పీ

శ్రీధర్ హత్యకు గురైన సంఘటన వేములవాడ పట్టణంలో సంచలనంగా మారడంతో ట్రైనింగ్ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలం వద్ద మృతుడి కుటుంబ సభ్యుల రోధించడంతో విషాదఛాయలు అములుకున్నాయి.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ఛాంపియన్‌షిప్



ట్రోఫీని అందుకుంటున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12: తెలంగాణ రాష్ట్రస్థాయి 56వ సీనియర్ ఖోఖో పోటీల పురుషుల ఛాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. నల్గొండ జిల్లా భువనగిరిలో ఈనెల 8 నుంచి 11వరకు తెలంగాణ ఖోఖో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు మహబూబ్‌నగర్, ఖమ్మం, మెదక్, జట్లపై గెలుపొంది సెమి ఫైనల్స్‌లో వరంగల్ జిల్లా జట్టుతో తలపడి 5 పాయింట్ల తేడాతో ఫైనల్స్‌లో ప్రవేశించిందని జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావు తెలిపారు. ఆదివారం రాత్రి పోరాపోరిగా సాగిన పురుషుల ఫైనల్స్‌లో కరీంనగర్ జట్టు రంగారెడ్డి జట్టుతో తలపడి ఒక్కపాయింట్ తేడాతో గెలుపొందిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచిన జట్టును డీవైఎస్ఓ కీర్తి రాజవీరు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఖోఖో సంఘం ప్రతినిధులు చిట్టి తిరుపతిరెడ్డి, డాక్టర్ వేల్పుల కుమార్, ఈ నరేష్, ఎ రవీందర్, వంగపల్లి సూర్యప్రకాశ్, ఖో ఖో కోచ్‌లు వెంకటేష్, సభ్యులు ఎస్ కె మోయినోద్దిన్, మంగ సంతోష్, బి శేఖర్, కట్ట సంతోష్, రాదారాణి, రేణుక, కవిత, మానస, ఆర్ఐ కుమార్, ఎస్ఎ రమేశ్, పండుగ ఆనంద్, ప్రసాద్, శ్రీలత, జ్యోతి, జలందర్, లక్ష్మన్, నవీన్ తదితరులు అభినందించారు.

ఎక్సైజ్ శాఖలో సీఐలు, ఎస్ఐల బదిలీలు



కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎక్సైజ్ శాఖలో భారీ సంఖ్యలో సీఐలు, ఎస్ఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ పి.తాతాజీని పరకాలకు బదిలీ చేశారు. హుజూరాబాద్ సీఐ దుర్గా భవానిని హన్మకొండకు, జగి త్యాల సీఐ ఎస్.ప్రభాకర్ రెడ్డిని వరంగల్ అర్బన్‌కు, సుల్తానాబాద్ సీఐ సీహెచ్ శామ్యూల్ ఆనంద్ రావును వరంగల్ అర్బన్ డీటీఎఫ్ సీఐగా, కరీంనగర్ రూరల్ సీఐ ఎం తిరుమలతను హన్మకొండ ఐఎంఎల్‌డిపో-1కు, రామగుండం సీఐ ఎస్ రమేష్‌ను ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, సత్తుపల్లి సీఐ వి రాజశేఖర్‌రావును వేములవాడకు బదిలీ చేశారు. వేములవాడ సీఐ జి.రామును కరీంనగర్ అర్బన్‌కు, జగిత్యాల సీఐ ఎస్ అశోక్‌కుమార్‌ను కరీంనగర్ రూరల్‌కు, లక్సెట్టిపేట సీఐ ఎస్ బాబాను తిమ్మాపూ ర్‌కు, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో సీఐలుగా పనిచేస్తున్న టి శ్రీనివాసులును హుజురాబాద్‌కు, ఎం మాధవిలతను జమ్మికుంటకు, ఆసిఫాబాద్ సీఐ సయ్యద్ మోసిన్‌అలీని కరీంనగర్ ఎన్‌ఫోర్స్ మెంట్‌కు, నేలకొండపల్లి సీఐ కె పోశెట్టిని పెద్దపల్లికి, పాల్వంచ సీఐ గరునాథ్‌ను సుల్తానాబాద్‌కు, కాగజ్‌నగర్ సీఐ సీహెచ్ మంగమ్మను రామగుండంకు బదిలీ చేశారు. ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మంథనికి, హరితబయో డిస్టిల్లరీ సీఐ ప్రియాంకను పెద్దపల్లికి, ఖమ్మం ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వై సర్వేశ్వర్‌రావును జగిత్యాలకు, ఊట్నూర్ సీఐ టి మహేందర్ సింగ్‌ను ధర్మపురికి, పెద్దపల్లి డీటీఎఫ్ సీఐ వినోద్ రాథోడ్‌ను మెట్‌పల్లికి, ఇచ్చోడ సీఐ సీహెచ్ రాజమౌళిని జగిత్యాల డీటీఎఫ్‌కు, పెద్దపల్లి సీఐ ఎం శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేటకు, ధర్మపురి సీఐ ఏ ముత్యంను ఆదిలాబాద్ డీటీ ఎఫ్‌కు, జమ్మికుంట సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్‌ను ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. మంథని సీఐ జి గురువయ్యను మంచిర్యాలకు, తిమ్మాపూర్ సీఐ జె ఇంద్రప్ర సాద్‌ను బెల్లంపల్లికి, ఎల్లారెడ్డిపేట సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్‌ను హైదరాబాద్ ఎస్‌టీఎఫ్‌కు, మెట్‌పల్లి సీఐ ఎం రాధను తూర్పాన్ డిస్టిల్లరికి, కరీంనగర్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ కె విజయ్ కుమార్‌ను ప్రియాంక డిస్టిల్లరీస్‌కు, జమ్మికుంట ఎక్సైజ్ ఎస్ఐ ఎం.రమాదేవి వరంగల్ అర్బన్ డీటీఎఫ్ ఎస్ఐగా బదిలీ చేశారు. సిరిసిల్ల ఎస్ఐ కె.విజేందర్ కొత్తగూడెంకు, లక్సెట్టిపేట ఎస్ఐ ఏఆర్‌సీ జాన్ రాబర్ట్‌ను కరీంనగర్ అర్బన్, చెన్నూర్‌లో పనిచేస్తున్న కే లక్ష్మణ్‌ను కరీంనగర్ రూరల్‌కు, ఖాజీపేటలో పనిచే స్తున్న ఎం.సౌమ్యను జమ్మికుంటకు, మెట్‌పల్లి ఎస్ఐ ఎంఏ మజీద్‌ను కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, కరీంనగర్ రూరల్ ఎస్ఐ కె.స్వప్నను జగిత్యాలకు, కరీంనగర్ అర్బన్ ఎస్ఐ కె.నరేష్‌ను ధర్మపురికి, ఎచోడ ఎస్ఐ సీహెచ్ లక్ష్మన్‌కుమార్‌ను మెట్‌పల్లికి, ధర్మపురి ఎస్ఐ కె.శ్రీనివాస్‌ను వేములవాడకు, పెద్దపల్లి ఎస్ఐ మనీషా రాథోడ్‌ను మంచిర్యాలకు, రామగుండం ఎస్ఐ జి.శారదను బెల్లంపల్లికి, పెద్దపల్లి ఎస్ఐ బి.ప్రభాకర్‌ను ఔసీపీ సాలూరకు, జగిత్యాల ఎస్ఐ ఎన్.సరితను మిర్‌దొడ్డికి, కరీంనగర్ అర్బన్ ఎస్ఐ ఆర్.రూపను హుస్నాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి



పల్లె రమణ(ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 12: కన్న కొడుకుకు ఉద్యోగం రాలేదని ఓ తల్లి పురుగుల మందు తాగి చికిత్స పొందుగూ మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం మండలోని తెర్లమద్ది గ్రామానికిచెందిన పల్లె రమణ (40) అనే మహిళ తన కొడుకుకు ఉద్యోగం రావట్లేదని మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉండడంతో ఎల్లారెడ్డిపేటకు తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. రమణకు భర్త రవీందర్, కొడుకులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలి



సునీతరావు, పద్మక్కను సన్మానిస్తున్న సభ్యులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 12 : తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సమావేశంలో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఆరు గ్యారెంటీలను ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రచారం చేయాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులు సునీతరావు, పద్మక్కను సన్మానించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో గురుకులం ఉపాధ్యాయినుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గురుకులం ఉపాధ్యాయినులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12: గురుకులంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టి నూతన నియామకాల ప్రక్రియను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురుకులాల జేఏసీ పిలుపు మేరకు ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గురుకులం ఉపాధ్యాయినులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు రోజారాణి, మమత, మనీష, శ్రీలత, సరిత, సంధ్య, రజిత, శాలిని, మాధవి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రెడ్డబోయిన గోపి

వీర్నపల్లి, ఫిబ్రవరి 12 : వీర్నపల్లి మండలం ఎర్రగడ్డ తండా గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి సోమవారం భూమి పూజ చేశారు. అంతకుముందు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ పూజారి ప్రేమ్ సింగ్ మహారాజ్, జ్యోతి బాయ్, నాయకులు నాగరాజు, లక్పతి, అనిల్, మహారాజ్, నందు, గంగారాం పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 12 : సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జాయింట్ యాక్షన్ నాయకులు ఈ నెల 16న దేశ వ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, ఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనే ఎల్లప్ప, కాంగ్రెస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు గొట్టె రుక్మిణి, టీడీపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్కాపూర్ సంఘటనపై అసెంబ్లీలో చర్చించాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి 12 : మాచారెడ్డి మండలం అక్కాపూర్‌లో దళిత మహిళను వివస్త్రను చేసి, దాడి చేసిన సంఘటనను అసెంబ్లీలో చర్చించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి ఇన్‌చార్జి భూంపల్లి భీమ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్కాపూర్ సంఘటన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో అనేక సమస్యలు చర్చకు వస్తున్నాయని, ఓ దళిత మహిళను వివస్త్రను చేసిన సంఘటన చర్చకు రాకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంబేద్కర్ సంఘం నాయకులు ప్రశాంత్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధన దిశగా పోరాటం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12: ఎస్సీ వర్గీకరణ సాధన దిశగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాలు పోరాటం చేస్తున్నాయని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజం, గోపాల్, శ్రీనివాస్, భగవంతం, రాజం, సత్తయ్య, దేవయ్య, నర్సయ్య, రాజయ్య, సత్యనారాయణ, శంకర్, అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు మొండి చేయి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 12 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీలకు మొండి చేయి చూపించదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం బీసీ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలు అంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చులకన భావన ఉందని ఆరోపించారు. మహాత్మా జ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్‌ప్లాన్ తీసుకొస్తామని టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించారన్నారు. నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, సుజిత్‌కుమార్, రాకేష్, శ్రీకాంత్, సిద్దు, ప్రనయ్, నరేష్ పాల్గొన్నారు.

ప్రజాహిత యాత్రను విజయవంతం చేయాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి12: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రజాహిత యాత్రను విజమవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దెవసాని కృష్ణ పిలుపునిచ్చారు. గంభీరావుపేటలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మంగళవారం గంభీరావుపేట మండలంలోకి యాత్ర ప్రవేశించనున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు గడ్డమీది ప్రసాద్‌రెడ్డి, పత్తి స్వామిరాజు, లక్ష్మీపురం రాజుగౌడ్, లక్కిరెడ్డి రాజిరెడ్డి, లక్ష్మణ్, దేవరాజు రమణమూర్తిరాజు ఉన్నారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ



దివ్యాంగుడి వద్దకు వెళ్లి మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 12: ప్రజావాణికి విన్నపాలు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. తరలివచ్చిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతికి దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో గౌతంరెడ్డి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 41 అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. వేములవాడ ఆర్డీవో మధుసుసూదన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన కస్తూరి పోశెట్టి అనే దివ్యాంగుడు వీల్ చైర్‌లో రావడంతో కలెక్టర్ అతడి వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ ఇప్పించాలని కోరడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

వేములవాడ అర్బన్ మండల పరిధిలోని అనుపురం ఆర్‌అండ్ ఆర్‌కాలనీలో సర్పంచ్ కొండపెల్లి వెంకట రమణారావు అక్రమాలపై విచారణ చేపట్టాలని, నిరుపేదలకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన ఎర్రం మల్లయ్యతోపాటు గ్రామస్థులు సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రాలను అందజేశారు.

ఉపాధిని చూపించండి

ఉపాధిని చూపించాలంటూ ఇల్లంతకుంట మండలం సోమారంపేటకు చెందిన దివ్యాంగురాలు కొమ్ము అనుప్రియ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసింది. గ్రామంలో తమ కుటుంబం కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నట్లు పేర్కొంది. డిగ్రీ చదివిన తనకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగావకాశం కల్పించాలని వేడుకుంది.

భూమిని అమ్ముకునేందుకు వీలు కల్పించాలి

సిరిసిల్ల పట్టణంలోని రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 76 సీ/3లో ఉన్న 15 గుంటల వ్యసాయభూమిని అమ్ముకునేందుకు వీలు లేకుండా రెవెన్యూ అధికారులు ఆంక్షాలు విధించారని, ఆ భూమిని అమ్ముకునేందుకు వీలు కల్పించాలని సిరిసిల్ల పట్టణానికి చెందిన గుర్రం నందిని కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 15 గుంటల్లో కొంత భూమిని విక్రయించగా రిజిస్ట్రేషన్ కావడం లేదని, కొనుగోలు చేసినవారు డబ్బులు ఇవ్వాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.

పట్టా ఇచ్చిన భూమికి హద్దులను చూపించాలి

ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలో సర్వే నంబరు 117/34లో రెండు ఎకరాల భూమికి గతంలో లావణి పట్టాను ఇచ్చారని, ఆ భూమికి హద్దులను చూపించాలని పానగంటి మల్లయ్య కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మా తండ్రి అంజయ్య పేరుతో పట్టాలను ఇచ్చారని, దానిలో ఇప్పటివరకు వ్యవసాయం చేసుకుంటున్నామని అ భూమికి సంబంధించి హద్దులు లేనందున ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

కృష్ణాజలాలపై మాట్లాడే నైతికహక్కు కేసీఆర్‌కు లేదు



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 12: కృష్ణాజలాలపై మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం కేసీఆర్‌కు లేదని కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పదేళ్లలో ఎందుకు పూర్తిచేయలేదన్నారు. కృష్ణానదిలోని ఆంధ్రప్రభుత్వం దోచుకెళ్తుంటే ఎందుకు ఆపలేకపోయారన్నారు. నదీజలాల విషయంలో కేసీఆర్ తెలంగాణ తీవ్ర అన్యాయం చేశారన్నారు. నల్లగొండలో కేసీఆర్ పెట్టిన బహిరంగ సభను నిరసిస్తున్నట్లు పేర్కొన్నారు. కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మచ్చ రాజేశం, నాయకులు బడుగు లింగం, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, వెంకటరెడ్డి, జమాల్, తిరుపతిరెడ్డి, ఎల్లయ్య, కేశవులు, గజేందర్‌రెడ్డి, లవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కృష్ణ జలాలపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలోని నాయకులు సోమవారం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. కృష్ణ జలాలపై తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసి తప్పును కప్పిపుచ్చుకునేందుకు నల్లగొండలో బహిరంగ సభ నిర్వహించడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. నాయకులు సాహెబ్, గిరిధర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్‌గౌడ్, నారా గౌడ్, నాగిరెడ్డి, భగవంతరెడ్డి, లాలా, మల్లారెడ్డి, పర్శరాములు, శ్రీనివాస్, రమేశ్, బాబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆలయ ఈఈ రాజేష్, ఏఈవో నవీన్

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ద్వాదశ జ్యోతిర్లింగ శక్తిపీఠ అన్నదాన సత్రం సికింద్రాబాద్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన శిబిరాన్ని ఆలయ ఈఈ రాజేష్, ఏఈవో నవీన్ ప్రారంభించారు. సుమారు ఏడు వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని వారు తెలిపారు. ఆలయ ఎలక్ట్రికల్ విభాగం ఏఈ డి.శేఖర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో జడ్పీ చైర్ పర్సన్ పూజలు



పూజలు చేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ అరుణ

కోనరావుపేట, ఫిబ్రవరి 12: కోనరావుపేట మండలం మామిడిపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు, మాజీ సర్పంచ్ కొక్కుల భారతీ, నర్సయ్య, ఆలయ అధికారులు శ్రీరాములు, గోలి మోహన్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 12: వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ వనపర్తి దేవరాజు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. చీర్లవంచ ఎంపీటీసీగా బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన దేవరాజు హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

చందుర్తి, ఫిబ్రవరి 12: విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే ఉద్యోగులకు గుర్తింపునిస్తాయని జడీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పత్తి రవీందర్‌కు జగిత్యాల జిల్లాకు బదిలీ అవగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు చేసిన సేవలను ప్రజలు మర్చిపోరన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ బైరవని లావణ్య -రమేష్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మండల్ కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, వైసీపీ అబ్రహం, ఎంపీవో ప్రదీప్, ఎంపీ టీసీలు మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్‌లో విధులు నిర్వహించిన ఎంపీడీవో శంకర్ నాయక్ జగిత్యాల జిల్లాకు బదిలీ అవగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది సన్మానించారు. రుద్రంగి మండలంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్, కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనగర్తి పాఠశాలలో నాగుపాము

కోనరావుపేట, ఫిబ్రవరి 12: కోనరావుపేట మండలం కనగర్తి ప్రభుత్వ పాఠశాల ఆవరణలోకి సోమవారం నాగుపాము వచ్చింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళన గురయ్యారు. అనంతరం సుద్దాల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కాపిల్ల నరేష్‌ను పిలిపించి నాగుపామును బంధించి గ్రామం బయట వదిలేశారు.

సంక్షిప్తంగా...

● ఇల్లంతకుంట: మండల కేంద్రానికి చెందిన అజీం అనే యువకుడు తనకు దొరకిన సెల్‌ఫోన్‌ను అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. అజీం కరీంనగర్ నుంచి ఇంటికి వస్తుండగా ఆదివారం రాత్రి రోడ్డుపై సెల్‌ఫోన్ దొరికింది. యజమానిని గుర్తించి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అప్పగించాడు.

● మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన కరేడ నిఖిల్ రెడ్డి గ్రూపు-4 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 142వ ర్యాంక్, జిల్లాస్థాయిలో 4వ ర్యాంక్ సాధించడంతో పెద్దలింగాపూర్ ఎంపీటీసీ స్వప్నకర్ణాకర్‌రెడ్డి అభినందించారు. పెద్దలింగాపూర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ల్యాగల సంపత్, పసుల కేశవులు, మోహన్, లచ్చయ్య, రవి, శ్రీనివాస్, చిన్నకనుకయ్య పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. పాఠశాలకు చెందిన కుక్కల పర్ణిక, గాదె పావని హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు చర్చ మండలిలో ప్రతిమ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు సుమారు 300 మందికి వైద్య పరీక్షలు జరిపి రూ.2.50 లక్షల విలువైన మందులను పంపిణీ చేశారు. ప్రతిమ ఆసుపత్రి బాధ్యులు ప్రేమ్‌సాగర్, సీఈవో ప్రసాద్ రావు, మార్కెటింగ్ చైర్మన్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని గీతామందిరం 25వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి, వేద పండితులు రఘురామశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ చేశారు.

● పల్లెల్లో స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజాప్రతినిధులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, అల్మాస్‌పూర్, తదితర గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం పనులను చేపట్టారు. గ్రామాల్లోని ప్రభు త్వ పాఠశాలలు, పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేశారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు తాజా మాజీ సర్పంచ్ మాట్ల మధు అల్పాహారం వితరణగా అందజేస్తున్నారు. ముందుకు వచ్చిన మాట్ల మధుకు ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు అభినందనలు తెలిపారు. స్థానిక ఎంపీటీసీ చెన్నమనేని వెంకటరావు, ప్యాక్స్ చైర్మన్ కొడూరి బాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

● వీర్నపల్లి : ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో నరేష్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రపరచి క్లోరినేషన్ చేయించారు.

● చందుర్తి : పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరు పాటించాలని మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు అన్నారు. మండలంలోని మూడపెల్లిలో సోమవారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీదుల్లో చెత్తచెదారం తొలగించి శుభ్రం చేశారు.

గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సమస్యను విన్నవిస్తున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : గ్రామ పంచాయితీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చల్ల నారాయణ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పినట్లుగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశామన్నారు. సర్పంచులు అప్పులు చేసి పనులు చేశారని, వెంటనే బిల్లులు అందేలా కృషి చేయాలని కోరారు. తమ పదవీకాలం పూర్తయ్యిందని, బకాయిలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు గట్ల మల్లారెడ్డి, పెండల మొగులయ్య, చింతలపల్లి శ్రీలత, పంచ అనుసూయ, లాలారాధా, పర్శరాములు, మేఘలవ్వ, పర్శరాం, తిరుపతి రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ సభను విజయవంతం చేయాలి



అభివాదం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 12: బీఆ ర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 39వార్డుల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, రెడ్యానాయక్, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా నాయకుడు బొల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన లక్ష్మీపూర్ గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 12: తంగళ్ల పల్లి మండల లక్ష్మీపూర్‌లో ప్రభుత్వ భూమి అన్యాకాంతం అవుతోందని, పరిరక్షించి గ్రామ అవసరాల కోసం కేటాయించాలని లక్ష్మీపూర్ గ్రామస్థులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో రైల్వేలైన్‌ల నిర్మాణంలో డంపింగ్‌యార్డు, వర్మికంపోస్టు షెడ్, హరితహారంలో నాటిన మొక్కలు పోతున్నాయని వివరించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాల కోసం కేటాయించాలన్నారు. కాకులబోరు వద్ద ప్రభుత్వ భూమి దాదాపు 20 ఎకరాలు కబ్జా గురవుతోందని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం వివరించారు. కార్యక్రమంలో రాజయ్య, మల్లయ్య, రాజలింగం, రాంబాబు, మల్లేశం, రమేష్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 13, 14 తేదీల్లో అబుదాబిలో పర్యటించనున్న సందర్భంగా గల్ఫ్ కార్మికుల పక్షాన టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వనర్ మంద భీంరెడ్డి సోమవారం బహిరంగ లేఖ రాశారు. గల్ఫ్ దేశాలలో సుమారు 88 లక్షల మంది వలస కార్మికులు నివసిస్తున్నారని వారికి కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గమ్యస్థాన గల్ఫ్ దేశాలలో అభివృద్ధిలో పాలుపంచుకుంటూ స్వదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం పంపిస్తున్న ప్రవాస భారతీయ కార్మికుల సేవలను గుర్తించాలని కోరారు. గల్ఫ్ ప్రాంతంలో పనిచేసే వలస కార్మికుల సంక్షేమానికి పథకాలు ప్రకటించాలని లేఖలో కోరారు. సౌదీ అరేబియా, యూ ఏఈ, ఓమాన్, కువైట్, ఖతార్, బహరేన్, ఆరు అరబ్ గల్ఫ్ దేశాలల్లోని ప్రవాస భారతీయ సంఘాల ప్రతినిధులతో సంక్షేమ, సామాజిక భద్రతా పథకాల గురించి కార్మికులకు అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. వలస వచ్చే కార్మికులకు పునరావాసం కల్పించాలని, విదేశీ మారకద్రవ్యం పంపేవారికి బంగ్లాదేశ్ ప్రభుత్వం లాగా రెండున్నర శాతం ప్రోత్సహకం అందించాలని, భారత దేశం నుంచి విదేశాలకు వెళ్లే ప్రతీ పౌరుడి వివరాలను భారతీయ విమానాశ్రయాల్లో రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖను పంపినట్లు మంద భీంరెడ్డి వివరించారు.

వైభవంగా మార్కండేయస్వామి జయంతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బొప్పాపూర్, గొల్లపల్లి, తదితర గ్రామాల్లోని మార్కండేయస్వామి ఆలయాల్లో సోమవారం మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయ ఆలయం నుంచి ప్రత్యేక వాహనంపై స్వామి వారి చిత్ర పటంతో గ్రామ పుర వీధుల గుండా శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది. అనంతరం దేవాలయంలో అర్చకుడు ఉమాశంకర్ ఆధ్వర్యంలో గణపతి, గౌరీ, వరుణ కలశ పూజ, లింగార్చన, తదితర కార్యక్రమాలను జరిపించారు. మంత్రోచ్చరణల నడుమ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. దంపతులు పాల్గొని పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులు సమర్పించారు. ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి రూ.33 వేల విలువైన 100 కుర్చీలను అందజేశారు. కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, ప్రముఖ వైద్యుడు సత్యనారాయణస్వామి, ఎన్ఆర్ఐ రాధారపు సత్యం, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దేవాంతం, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షులు దేవదాస్, సుదర్శన్, సంయుక్త కార్యదర్శి అంబ దాస్, కోశాధికారి బాలరాజు, యూత్ అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు భాస్కర్, శ్రీకాంత్, మనోహర్, రమేశ్, అజయ్, రవి, నాయకులు గౌస్, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, కిషన్, ఎల్లయ్య, వెంకట్‌రెడ్డి, పర్శరాములు, వెంకటనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మార్కండేయ దేవాలయం ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం మార్కండేయ శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది.

ముస్తాబాద్: మార్కండేయున్ని పూల పల్లకీపై శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పద్మశాలీలు బాలకిషన్, తాటిపాముల లక్ష్మీనారాయణ, గౌడ మల్లేశం, దూడం రమేష్, కృష్ణహరి, బండారి శ్రీకాంత్, మధు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో మార్కండేయ జయంతి సందర్భంగా మార్కండేయ స్వామిని సోమవారం శోభాయాత్ర నిర్వహించారు.

రుద్రంగి : భక్త మార్కండేయ స్వామి జయంతిని రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మార్కండేయ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలకు జ్ఞాపికలను అందజేశారు.



శోభాయాత్రలో పద్మశాలీలు



శోభాయాత్రలో ఎంపీపీ, ఆగయ్య



కుర్చీలను అందజేసిన ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి